


ట్రిపుల్ ఐటీకి కల్లివెట్టు విద్యార్థిని



బుచ్చినాయుడు కండ్రిగ : గురువారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఎంపిక జాబితాలో మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థిని నవ్య దేవాంగ ఇడుపులపాయ క్యాంపస్ కు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 578 మార్కులతో పాఠశాల్లో ప్రథమ స్థానంలో అత్యధిక మార్కులు సాధించిందని, పాఠశాల తరపున ఐఐటికి ఎంపిక కావడంతో ఉపాధ్యాయ బృందం అభినందించారు.



బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట సిఐటియు నిరసన

ప్రమాదకర లేబర్‌కోడ్లను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాతా తన పాత విధానాలనే అవలంభిస్తోందని, ఈ విధానాలను దేశంలోని యావత్ కార్మిక వర్గం ఎదిరించి పోరాడాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. గురువారం ఉదయం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ గత ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేశాయన్నారు. ఆ ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కేంద్రంలోని బిజెపి బలాన్ని తగ్గించారన్నారు. గత ఐదేళ్లలో జరిగిన కార్మిక కర్షక ఉద్యమాల ఫలితంగానే బిజెపికి ఎంపి స్థానాలు తగ్గాయన్నారు. ఇది కార్మికుల నైతిక విజయం అన్నారు. బిజెపి తన విధానాలను మార్చుకోకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎన్.మాధవ్, కె.వేణుగోపాల్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాటల తీరు చూస్తుంటే విశాఖ స్టీలు ప్లాంట్ ప్రైవేటీకరణ తప్పదని అర్థమవుతుందన్నారు. అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, పి.బుజ్జి, రమేష్, తంజావూరు మురళి, ఎన్‌డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో గ్రీన్ ఇండియా మిషన్ ర్యాలీ

ప్రజాశక్తి - రేణిగుంట



స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు రేణిగుంట పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పచ్చని చెట్లు -ప్రగతికి మెట్లు అని నినాదాలతో విద్యార్థులు రేణిగుంట ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ తదనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు మొక్కలు నాటారు. పాఠశాల ఏజిఎం సురేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణం కాపాడుకోవాల్సిన బాధ్యత మనదరిమీద వుంది, ప్రతి ఒక్కరు చెట్లు నాటలని, ప్లాస్టిక్ వాడకాన్ని, వాహనాల వాడకాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ చారుమతి మాట్లాడుతూ వాహనాలు, పరిశ్రమలు విడుదల చేసే పొగ వలన గ్లోబల్ వార్మింగ్ ఎక్కువై పర్యావరణానికి నష్టం వాటిల్లి వర్షపాతం కూడా తగ్గిపోతుంది. చెట్లు నాటడం వలన గ్లోబల్ వార్మింగ్ తగ్గి జీవజాతులకు ఎంతో సహాయంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఢీన్ గోవర్ధన్ పాల్గొన్నారు.

హాస్టళ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : బొజ్జల సుధీర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రభుత్వ వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం వసతి గృహాల అధికారులు గురువారం ఊరందూరులో ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శ్రీకాళహస్తీశ్వర స్వామి శేష వస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వసతి గృహాల సమస్యలపై ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అధికారులతో చర్చించారు. శ్రీకాళహస్తిలో వసతి నిర్వహణపై విమర్శలు ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. శ్రీకాళహస్తి పట్టణం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో గల సమీకృత వసతి గృహాన్ని తాను ఇటీవల పరిశీలించాననీ, అక్కడ వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించానన్నారు. ఈ వసతి గృహంలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడానికి ఒక పరిశ్రమ నిర్వాహకులతో చర్చించానన్నారు. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో వారు వసతి గృహంలో వసతులు కల్పించడానికి ముందుకు వచ్చారన్నారు. ఈ పనులు త్వరలోనే పూర్తి చేస్తారన్నారు. ఇక శ్రీకాళహస్తి పట్టణంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గహాలను కూడా సీఎస్ఆర్ నిధులతో అభివద్ధి చేస్తామన్నారు. వసతి గృహాల భవనాలకు ఏవైనా మరమ్మతులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. అందరం కలసి వసతి గృహాలను కార్పోరేట్ స్థాయిలో మారుద్దామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిని కలిసిన వారిలో వార్డెన్లు రామయ్య, కిరణ్ తదితరులు ఉన్నారు.

భారీ కేక్‌తో బృందమ్మ జన్మదిన సంబరాలు



మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి, ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బందమ్మ జన్మదిన వేడుకలను టిడిపీ నేత లక్కమనేని మధు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు 71 కిలోల భారీ కేక్‌ను ఊరందూరులో బందమ్మ చేత కట్ చేయించారు. అనంతరం ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

సాయి సుధాలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



స్థానిక తిలక్ రోడ్‌లోని శ్రీ సాయి సుధా కంటి ఆసుపత్రిలో సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత రెటీనా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు సుమారు 50 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ కంటి వెనుక భాగంలో ఉండే సున్నితమైన రెటీనా పొర కాంతిని గ్రహించి మెదడుకు ప్రతిబింబాలు పంపుతుందన్నారు. డయాబెటిక్ రెటీనోపతి ప్రారంభ దశలో దష్టి సాధారణంగా ప్రభావితం కాదని, రెటీనో పతి అభివద్ధి చెందుతున్నప్పుడు దష్టి ప్రభావితం అవుతుందన్నారు. పరిస్థితిని చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేస్తే పూర్తిగా దష్టిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. డయాబెటిస్ ఉన్నవారు ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో హాస్పటల్ సిబ్బంది హిమ బిందు, సునీత, మహేష్, నరేంద్ర, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వంశీకృష్ణకు యంగ్ పీడియాట్రిషన్ అవార్డు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుపతికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఏ.వంశీకృష్ణ యంగ్ పీడియాట్రిషన్ అవార్డును అందుకున్నారు. అంకుర మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఏ. వంశీకష్ణ అందిస్తున్న వైద్య సేవలను గుర్తించిన ఏసియా టుడే మీడియా సంస్థ యంగ్ పీడియాట్రిషన్ ఆఫ్ ది ఇయర్ ఆంధ్ర ప్రదేశ్ అవార్డుతో పాటు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు అందజేశారు. గురువారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్ వంశీకృష్ణను అభినందించారు.



'వర్షం'లో వేరుశనగ 'వ్యథ'

- వేరుశనగ ధర పతనం
- రంగు మారితే ఎలా అన్న దిగులు

ప్రజాశక్తి - డక్కిలి

ఆరుగాలం కష్టించిన వేరుశనగ రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకొని సాగుచేసిన వేరుశనగ ధర రోజురోజుకూ తగ్గుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తాము పండించిన వేరుశనగకు ధర ఏమాత్రం ఇస్తారో అని వ్యాపారుల వంక దీనంగా చూస్తున్నారు. రెక్క లు ముక్కలు చేసుకొని సాగుచేసిన వేరుశనగ కు ప్రస్తుతం బస్తా (41 కేజిలు) ధర రూ 2200 పలుకుతుంది. ధరలు రోజురోజుకూ తగ్గుతుండడంతో రైతులు దిక్కుతోచ ని స్థితిలో పడిపోయారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. రెక్కల కష్టానికి ఫలితం లేకపోయినా.. పెట్టుబడులు కూడా రాకపోతే ఎలా అంటూ ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడి ఎక్కువ.. దిగుబడితక్కువ..

దిగుబడులు సైతం పడిపోవడంతో పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక తలలు పట్టుకుంటున్నారు. పెరిగిన ఎరువులు పురుగమందులు విత్తనాలు కూలీ రేట్లు తో ఈ ఏడాది వేరుశనగ సాగుకు పెట్టుబడి చాలా ఎక్కువైందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు కనిష్ఠంగా 35 నుండి 40 బస్తాల వేరుశనగ దిగుబడి రావాలని రైతులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల 20 బస్తాల దిగుబడి కూడా దాటడం లేదని వాపోతున్నారు. వేరుశనగ విత్తనాలు బస్తా రూ 3000 నుండి రూ 3200 వరకూ కొనుగోలు చేశామని, పొలం చదును, ఎరువులు, నూర్పిడి కూలీల ఖర్చు మొత్తం కలిస్తే ఎకరాకు రూ.50వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరా వేరుశనగ విక్రయిస్తే రూ.35వేల వరకు మాత్రమే వస్తుందని, చేసిన కష్టం గంగపాలు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తంచే చేస్తున్నారు.

గోరుచుట్టుపై రోకటిపోటులా వర్షం

డక్కిలి , వెంకటగిరి మండలాల్లో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వేరుశనగ రైతులకు ఇక్కట్లు తెచ్చింది. రెండు మండలాల పరిధిలో సుమారు రెండు వేల ఎకరాల్లో సాగు చేశారు. పంట చేతికి రావడంతో నూర్పిళ్లు చేసి రెండు రోజులగా పొలాల్లోనే ఆరబెడుతున్నారు. భారీవర్షం కురవడంతో కల్లాంలలో రాశులు తడిసిపోయాయి. పట్టలు సిద్ధం చేసుకున్నా ఈదురుగాలుల ధాటికి ఇబ్బంది ఏర్పడింది. మరో రెండు రోజులు వర్షం కొనసాగితే వేరుశనగ కాయలు రంగు మారి ధరలు మరింత పతనం అవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధరలు ఇవ్వాలి : కేసాని కోటేశ్వరరావు, రైతు, మిట్టపాలెం, డక్కిలి



వేరుసెనగకు గిట్టుబాటు ధరలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వ్యాపారులు సిండికెట్ అవడంతో రైతుల వద్ద పంట ఉన్నంత వరకూ ధరలు పెంచడం లేదు. మార్కెట్ లో నూనె ధరలు తగ్గకుండా వేరుశెనగ కాయల ధరలు మాత్రం ఎలా తగ్గుతున్నాయో అర్థం కావడం లేదు.

వర్షంవల్ల వ్యయం పెరుగుతుంది : ఈగా చిన్నబ్బాయి, రైతు , మిట్టపాలెం , డక్కిలి



వేరుశెనగ పంట నూర్పిడి సమయంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వేరుశెనక్కాయలు తడిసిపోయి అవస్థలు పడ్డాం. పొలాల్లో నుంచి రోడ్డుమీదకి తీసుకొచ్చి ఆరబెట్టుకోవాల్సి రావడంతో అదనపు వ్యయం అవుతుంది. ఇలాగే మరో రెండు రోజులు వర్షం కురిస్తే కాయలు రంగు మారి ధర ఎక్కడ తగ్గిపోతుందో అర్థం కావడం లేదు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ వెంకట నరసింహ

పార్లపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో...

ముగ్గురు వలస కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

మండలంలోని పార్లపల్లి పంచాయతీ శ్రీనిధి ప్యాకింగ్ అట్టల ఫ్యాక్టరీ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఒరిస్సా వలస కార్మికులు దుర్మరణం పాలయ్యారు. శ్రీకాళహస్తి వైపు వెళుతున్న కారు కార్మికులను ఢీకొంది. దీంతో వీరు అక్కడికక్కడే మృతిచెందారు. బఫున్‌సింగ్ (23), రాజాసింగ్ (24), సుఖదేవ్‌సింగ్ (25) బండిలో వస్తుండగా పార్లపల్లి రహదారిపై కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాళహస్తిలో రోజువారీ నిత్యావసర వస్తువులు తీసుకుని తిరుగు ప్రయాణంలో ఈ ఘటన జరిగింది. కారు యజమాని టి.వినోద్‌కుమార్, తండ్రి ఆనంద్‌గా గుర్తించారు. డిఎస్‌పి ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ వెంకట నరసింహ సంఘటనా స్థలానికి చేరుకుని 108 ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి మృతదేహాలను తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల ఇంటిస్థలాల సమస్య పరిష్కరించండి

టిటిడి ఈవోకు వినతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టీటీడీ ఉద్యోగులకు పాదిరేడు వద్ద కేటాయించిన ఇంటిస్థలాల అభివద్ధి పనులు వెంటనే చేపట్టాలని, పల్లం వద్ద ఇచ్చిన ప్రొసిడింగ్స్ ప్రకారం ఇంకా ప్రభుత్వం నుండి రావలసిన భూమిని సేకరించి ప్లాటింగ్ చేపట్టాలని ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ నాయకులు ఈవో శ్యామలరావుకు వినతిపత్రం సమర్పించారు. టెంటివ్ అప్రువల్ తుడా నుండి ఇప్పించాలని, రిజిస్ట్రేషన్స్‌లో జరిగిన పొరబాట్లకు రిజిస్ట్రార్‌తో మాట్లాడి ఆ డబ్బులను టీటీడీ చెల్లించాలని అభివద్ధి పనులు టీటీడీ ఉచితంగా చేసి (రోడ్స్, డ్రైనేజీ, విద్యుత్, నీటి సరఫరా, పార్కులు)లేదా గతంలో మాదిరిగా 75 శాతం సబ్సిడీ ఇవ్వాలన్నారు. సర్వీస్‌లో మిగిలిపోయిన 1700 మందికి, పెన్షనర్లు 1700 మందికి భూమిని సేకరించి ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. సత్వరం పూర్తి సమాచారం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. ఈవోను కలిసిన వారిలో టిటిడి ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ నాయకులు గోల్కొండ వెంకటేశం, గంపల వెంకటరమణారెడ్డి, ప్రసాదరావు, వి.రామచంద్ర, నాగార్జున, ఇందిర, కల్పన, గుణశేఖర్, వాసు పాల్గొన్నారు.

అందుబాటు ధరలో కందిపప్పు, బియ్యం : జేసీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

కందిపప్పు, బియ్యం ప్రజలకు అందుబాటు ధరల్లో లభించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సంయుక్త కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్‌ఎం పేర్కొన్నారు. గురువారం తిరుపతి రైతు బజార్ నందు కందిపప్పు, బియ్యం ప్రజలకు అందుబాటు ధరలకు ఉండేలా ప్రారంభించారు. ఈ



చంద్రగిరి సూపర్‌మార్కెట్‌లో..

సందర్భంగా జెసి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు అదుపులో ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ధరలను తగ్గించి వినియోగదారులకు ఉపశమనం కలిగించటానికి ప్రభుత్వ స్థాయిలో హోల్‌సేల్ కిరాణా మర్చెంట్స్, రైస్ మిల్లర్స్ ప్రతినిధులతో రాష్ట్రస్థాయిలో ఒక సమావేశం ఏర్పాటు చేసి నిత్యావసర సరుకుల ధరలు తగ్గించి వినియోగదారులకు అందించే విధంగా ఒప్పందం కుదుర్చుకుందని, ఈ ఒప్పందం లో భాగంగా జిల్లలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హోల్‌సేల్ కిరాణా మర్చెంట్స్ అసోసియేషన్, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో దాదాపు 16 కౌంటర్లను ఏర్పాటు చేసి అందులో తిరుపతి, గూడూరు లోని రెండు రైతు బజారు కౌంటర్లతో పాటు ఏర్పాటు చేశామన్నారు. సదరు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 16 కౌంటర్ల ద్వారా దాదాపు 593 మంది లబ్ధి దారులకు 1516 కిలోల బియ్యం, 1002 కిలోల కందిపప్పు అమ్మడం జరిగిందనీ, కేజీ కందిపప్పు ధర మార్కెట్‌లో కిలో రూ.181 ఉండగా రూ.160 కు అమ్మడం జరుగుతోందని, స్టీమ్డ్ రైస్ మార్కెట్ ధర రూ.56 ఉండగా రూ.49 కి అమ్మడం జరుగుతోందని, పచ్చి బియ్యం మార్కెట్ ధర రూ.53 ఉండగా రైతు బజార్లలో రూ.48 అమ్మడం జరుతోందని, వినియోగ దారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం (చంద్రగిరి) : అధిక ధరలు నియంత్రణలో భాగంగా చంద్రగిరి సూపర్ మార్కెట్‌లో తనిఖీలు చేసిన ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి బస్టాండ్ ఎదురుగా ఉన్న స్వర్ణ సూపర్ మార్కెట్ లో విక్రయ ధరలను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని స్వర్ణ సూపర్ మార్కెట్లో వారు ప్రారంభించారు. మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయలేని సామాన్య మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి సుబ్రహ్మణ్యం నాయుడు, రమేష్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, లంకెల లలిత పాల్గొన్నారు.




తిరుపతి రైతు బజారులో...

టీటీడీ హెల్త్ కార్మికులకు రూ.26 వేలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

టీటీడీలో పనిచేస్తున్న హెల్త్ విభాగం కార్మికులకు కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, గతంలో టీటీడీ ప్రకటించిన విధంగా లడ్డు కార్డు, దర్శన సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. గురువారం యశోద నగర్ లోని సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుమలలో పనిచేస్తున్న హెల్త్ కార్మికులు సకాలంలో జీతాలు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని, కార్మికులపై పని భారం తీవ్రంగా ఉందని, వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించే విధంగా టీటీడీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటు అవుతున్న టిటిడి పాలకమండలి హెల్త్ పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని, కనీస వేతనం 26 వేలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సులభ సంస్థ వారు 40 రోజుల కు వేతనం దాదాపు 5 కోట్ల రూపాయలు కార్మికులకు చెల్లించకుండా అన్యాయం చేశారు. గతంలో ఈవో గా ఉన్న ధర్మారెడ్డి దష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. సులబ్ చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దుచేసి నేరుగా టీటీడీ నే జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయక తప్పదని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు జి బాలసుబ్రమణ్యం, టిసుబ్రమణ్యం, వేణుగోపాల్, మాధవ్, బుజ్జి, ఉమాపతి, చిరంజీవి, బుల్లెమ్మ, బ్రహ్మయ్య, రాజేంద్ర, రమేష్, మునిశంకర్, రామూర్తి పాల్గొన్నారు.



వ్యవసాయ యాంత్రీకరణతో ఖర్చు ఆదా : కలెక్టర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

వ్యవసాయ యాంత్రీకరణతో ఖర్చు, సమయం ఆదా అవుతుందని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. వడమాలపేట కదిరి మంగళం గ్రామ పరిధిలోని రైతు పొలాల్లో రాస్, కృషి విజ్ఞాన కేంద్రం చేపట్టిన డ్రోన్ పైలెట్ ద్వారా పురుగు మందుల పిచికారీని పరిశీలించారు. విత్తనాలు చల్లే రోలర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డ్రిప్ స్ప్రింకర్ల ద్వారా ఎఫెక్టివ్‌గా వాడుకోవచ్చన్నారు. ఆయిల్‌ఫామ్ జిల్లాకు వరమని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎకరా పొలంలో మందు పిచికారీ చేయడానికి 10-15 నిమిషాల సమయం పడుతుందన్నారు. రైతులు అంగీకరిస్తే సిహెచ్‌సి గ్రూపుకు సబ్సిడీ ద్వారా లోన్ అందజేస్తామన్నారుర. నామమాత్రపు ధర అద్దెతో వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కెవికె హెడ్ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు. 30 మంది డ్రోన్ పైలెట్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం పాదిరేడు గ్రామ పరిధిలోని ఆయిల్ ఫామ్ నర్సరీని, అలాగే డ్రిప్ ఇరిగేషన్



పోర్టబుల్ స్ప్రింక్లర్స్, మినీ స్ప్రింక్లర్స్ వాడుతున్న రైతుల పొలాలను పరిశీలించారు. ఉద్యాన శాఖ అధికారి వివరిస్తూ జిల్లాలో 151 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు అవుతున్నదని, ఈ సంవత్సరానికి 400 హెక్టార్ల లక్ష్యంగా నిర్దేశించామన్నారు. గ్రామస్తులు స్మశాన వాటికకు స్థలం గురించి కలెక్టర్ కోరగా వారంలోపు స్థలాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, ఏపీఎంఐపి పిడి సతీష్, తహశీల్దార్ రాజనర్సింహ, ఎంపీడీవో సుజాత, ఏ డి ఏ లు ధనుంజయ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

జనాభాతో పాటు ఆహార నిల్వలు పెరగాలి

ప్రజాశక్తి - క్యాంపస్, యంత్రాంగం

జనాభాతో పాటు ఆహార నిల్వలు పెరిగినపుడే సమతుల్యత సాధ్యమని, లేదంటే ఆకలిచావులకు, నిరుద్యోగానికి కారణమవుతుందని వక్తలు ఉద్ఘాటించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని డిపార్టుమెంట్ ఆఫ్ పాపులేషన్ స్టడీస్ అండ్ సోషల్ వర్కు విభాగంలో నిర్వహించారు. కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.పద్మనాభం, సెట్విన్ సిఇఒ మురళీకృష్ణ, డిపార్టుమెంట్ హెడ్ ప్రొఫెసర్ టి.చంద్రశేఖరయ్య, సోషల్ వర్కు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సాయి సుజాత, ఆంధ్రబ్యాంక్ మాజీ మేనేజర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో డాక్టర్ చంద్రకళ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. చిన్న కుటుంబం చింతల్లేని కుటుంబం అంటూ నినదించారు. సత్యవేడు మండలం దాస్‌కుప్పం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, గర్భనిరోధక మాత్రలు, కండోంలను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గుణశేఖర్, ఎం సుబ్రహ్మణ్యం ఎంపీహెఇఒ, నాగజ్యోతి సూపర్వైజర్ పాల్గొన్నారు.


పంచాయతీలతోనే సచివాలయాలు..?

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

గ్రామ పంచాయతీలకు మళ్లీ మంచిరోజులు రానున్నాయా అంటే ఔననే అనిపిస్తోంది. సర్పంచ్‌లకు మళ్లీ అధికారాలు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు గ్రామ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో గ్రామ పంచాయతీలు తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నాయి. పంచాయతీలకు మంజూరైన 14, 15 ఆర్థికసంఘం నిధులను వైసీపీ సర్కారు ఇతర అవసరాలకు దారిమళ్లించేది. దీంతో పాలక వర్గాలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. అయితే, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థకు మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలని యోచిస్తోంది.

సచివాలయాలను గ్రామ పంచాయతీలతో అనుసంధానం చేసేలా అడుగులు వేస్తోంది. సర్పంచ్‌లకే పూర్తి అధికారాలు అప్పగించాలని భావిస్తోంది. జిల్లాలో 30 మండలాల పరిధిలో 912 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 647 సచివాలయాలు ఉన్నాయి. కార్పొరేషన్, మున్సిపాల్టీల పరిధిలో మరో 75 సచివాలయాలు (ఇచ్ఛాపురం-10, పలాస-16, ఆమదాలవలస-11, శ్రీకాకుళం-38)ఉన్నాయి. అయితే, ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా గ్రామ పంచాయతీలకు వెళ్లకుండా సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. సచివాలయాల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలకు ఉన్నా అందులో పనిచేసే ఉద్యోగులు వారి పరిధిలో లేకుండా పోయారు. వాటి పర్యవేక్షణను రెవెన్యూ శాఖకు అప్పగించింది గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం. కనీసం పంచాయతీ సాధారణ నిధులు ఖర్చు చేయడానికి కూడా అభ్యంతరాలు తెలిపింది. తమకు హక్కులు కల్పించాలని సర్పంచ్‌లు పలుమార్లు వైసీపీ ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లినా పాలకులు పట్టించుకోలేదు. దీంతో అటు సర్పంచులు కాని ఇటు పంచాయతీ కార్యదర్శులు గాని ఏమీ చేయలేకపోయారు.

నిధుల ఖర్చు విషయంలో జగన్ సర్కారు కట్టడి చేయడంతో పంచాయతీల్లో కనీస వసతులు సమకూర్చడానికి ఆపసోపాలు పడ్డారు. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలను



సకాలంలో చెల్లించలేకయారు. చిన్నచిన్న మరమ్మతు పనులకు బిల్లులు ఇవ్వలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదాయం ఉన్న పంచాయతీలదీ ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో పంచాయతీ వ్యవస్థకు గత వైభవం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అధికారులతో వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులను పంచాయతీలకు అనుసంధానం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. సర్పంచ్‌లకు అధికారం అప్పగించడం ద్వారా గ్రామాల అభివద్ధితో పాటు ప్రజలకు సత్వర సేవలు అందుబాటు లోకి తెచ్చేలా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలంలో వివిధ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలగనుందని ఏడీఈ శేషాద్రిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతులు దృష్ట్యా అసౌకర్యం కలగనుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా మండలంలోని పరిధిలోని నరసింగాపురం, నాగయ్యగారిపల్లి, రామిరెడ్డిపల్లి, కూచివారిపల్లి, బుచ్చినాయుడుపల్లి, శంకరయ్యగారిపల్లి, పుల్లయ్యగారిపల్లి, బంధార్లపల్లి, కొటాల, రంగంపేట, నారావారిపల్లి, కందులవారిపల్లి, శేషాపురం, చిన్నారామాపురం, భీమవరం, యల్లంపల్లి గ్రామాలలో అంతరాయ ఏర్పడుతుందన్నారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అసౌకర్యం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. సాదారణంగా ప్రతి రెండవ శనివారం మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా ఆ రోజున టీటీడీ వారు పార్వేట ఉత్సవం నిర్వహిస్తుడడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

బాపట్ల నేతల పాదయాత్ర

ప్రజాశక్తి-గూడూరు టౌన్: బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు సీఎం కావడంతో తిరుమల శ్రీవారి దర్శనార్థం పాదయాత్ర చేపట్టారు. గురువారం వారి పాదయాత్ర గూడూరు పట్టణానికి చేరుకుంది. టీడీపి నాయకుడు మాముడూరు హరికృష్ణ వారికి ఘన స్వాగతం పలికారు. తాగునీరు, అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా రంజక పాలన సాగుతుందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంప్‌సెట్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: గత కొద్దిరోజులుగా మేర్లపాక పంచాయతీలోని పంప్ సెట్ పని చేయకపోవడంతో సర్పంచ్ కె.గంగాధర్ కొత్త పంప్‌సెట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడి ప్రజలకు ఇబ్బంది తీరింది. మాజీ సర్పంచ్ సివి రమణ, చింతయ్య, ముని సుబ్బులు పాల్గొని మరమ్మతులు గావించారు.

అక్రమాలపై చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యేకి ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వినతి


ప్రజాశక్తి-డక్కిలి: డక్కిలి మండల వెలుగు కార్యాలయంలో అక్రమాలు, అవినీతి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు గదల మునెయ్య గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నియోజవర్గ అధ్యక్షులు ఎస్‌కే రఫీ తదితరులు పాల్గొన్నారు.

18న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మండల సాధారణ సర్వసభ్య సమావేశం 18న ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వివి సూర్య సాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. మధ్యాహ్నం 2.30గంటలకు చంద్రగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో నిర్వహిస్తామన్నారు.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుంటాం

- టీడీపీ వ్యక్తిగత కక్షసాధింపులకు పాల్పడదు
- మాజీ ఎమ్మెల్యే భద్రత కోరితే నా గన్ మెన్‌లను పంపుతా
- కూటమి నేతల సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి-రామచంద్రాపురం (తిరుపతి రూరల్): సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకుంటామని, ప్రతి నెలా కూటమి నేతలతో సమావేశమవుతామని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. గురువారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలతో సమావేశమైయ్యారు. సమావేశ అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రగిరి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలన్నీ నెరవైరుస్తామన్నారు. అందుకు సంబంధించి కార్యచరణ ఇప్పటికే మొదలు పెట్టామని స్పష్టం చేశారు. గతంలో ఉన్న ప్రజాప్రతినిధి అన్ని విధాల దోచుకొని, ఆ విషయాల్ని బయటకు తీస్తుంటే తమపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. అభివృద్ధిపైనే దృష్టి సారించాం తప్ప కక్షసాధింపులకు పాల్పడలేదని వారు అన్నారు. మాజీ ఎమ్మెల్యే భద్రత కోరితే తన గన్‌మెన్‌లను పంపుతానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. జర్నలిస్టులకు ఎంపి, కలెక్టర్ సహకారంతో పట్టాలు మంజూరు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఇంకా పలు సమస్యలు, తనపై చేస్తున్న ఆరోపణలు, అభివృద్ధి పనులకు సంబంధించి వివరంగా మాట్లాడారు. సమావేశంలో టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు సీఆర్ రాజన్, నాయకులు తిరుమలరెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, జనార్దన్‌నాయుడు, కేశవులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం'



ప్రజాశక్తి-నాయుడుపేట: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని నారాయణ హైస్కూల్ వేదికైన పర్యావరణ సంరక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్వచ్ఛమైన నీరు, గాలి, నేలలను యథావిధిగా ముందు తరాలకు అందించాలన్నారు. పరిశుభ్రత, పచ్చదనంతో కూడిన ఆరోగ్యవంతమైన సమాజం కోసం [illegible] విద్యార్థులకు పిలుపునిచ్చారు. నారాయణ హైస్కూల్ ఏజీఎం గురువయ్య మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతులన్నీ ప్రకృతిని ఆరాధిస్తే, చెట్టు నదులు పర్వతాలను గతంలో పూజించేవారని తెలిపారు. అలాగే ఒక చెట్టు నరికే ముందు పది మొక్కలు నాటే వారిని అన్నారు. వృక్షాలు ఉత్పత్తి చేయని జీవన విధానంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులు పర్యావరణం, పరిరక్షణ, పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ రియాజ్, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఏవో షేక్ గౌసియా, పలువురు పాల్గొన్నారు.

'పీర్ల పండుగకి విచ్చేయండి'



ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం మోదుగులపాలెం గ్రామంలో పీర్ల పండగ సందర్భంగా మోదుగులపాలెం రేర్ డైమండ్స్ యూత్ ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ మోహన్ బాబును ఆహ్వానించారు. ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తమ స్వగ్రామంలో కుల మతాలకు అతీతంగా పీర్ల పండగ నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే మోదుగులపాలెం అభివృద్ధికి ఆయన సహకరిస్తానని తెలిపారు. అనంతరం పీర్ల పండగకు మోహన్‌బాబు నగదు రూపంలో విరాళం అందజేశారు. దయాకర్ మొదలై, శివకుమార్, కిరణ్, చంద్రశేఖర్ చౌదరి, మంచు భరత్ కుమార్, మంచు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర దొంగలను వదిలేది లేదు

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి బండి సంజయ్

ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి ఆస్తులకు పంగనామాలు పెట్టిన నయవంచకులను జనం తరిమికొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రస్తుతం స్వామివారికి నిత్యం సేవ చేసే రాజ్యం వచ్చిందన్నారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీలో గత వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు వీరప్పన్ వారసులని, వారు ఎర్రచందనం పేరుతో జాతీయ సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఈ డబ్బుతో రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారన్నారు. ఎర్రచందనం దొంగలను వదిలిపెట్టేది లేదన్నారు. శ్రీవారి నిధులను పక్కదారి పట్టించి తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారన్నారు. త్వరలోనే వారికి శిక్ష పడుతుందన్నారు.

మెకానిక్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మెకానిక్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల మెకానిక్స్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, అధ్యక్షులుగా తిరుణామల్లి, శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎస్డి ఆలీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టిడిపి నేత నెలవల రాజేష్‌లకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. షేక్ రఫీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మెకానిక్‌లకు ఆటోనగర్ ఏర్పాటు చేస్తామని హామీని నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సహకారంతో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసి చైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డిలను కలసి ఆటోనగర్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దశరద, నజీర్, రమేష్, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

బృందమ్మకు శుభాకాంక్షల వెల్లువ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి, బొజ్జల బృందమ్మ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, అభిమానులు బృందమ్మకు పెద్ద ఎత్తున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో విజయ్‌కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు, గాలి మురళి నాయుడు, సురేంద్ర యాదవ్ తదితరులు ఉన్నారు.

ఇసుక పంపిణీలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి : ఆదిమూలం

ప్రజాశక్తి - నాగలాపురం: ఉచిత ఇసుక పంపిణీలో సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఎల్ఏ కోనేటి ఆదిమూలం జేసీ ధ్యాన్‌చంద్‌కు విన్నవించారు. గురువారం సుబ్బానాయుడు కండ్రిగ ఇసుక రీచ్ పరిశీలనకు వచ్చిన జేసీని ఎంఎల్ఏ కలుసుకున్నారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ సుబ్బానాయుడు కండ్రిగ రీచ్‌లో నాణ్యమైన ఇసుక ఉన్నందున డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలు, నియోజకవర్గ ప్రజల గృహ నిర్మాణాలకు మొదటగా ఇసుక పంపిణీ చేయాలన్నారు. ఆ తరువాత మాత్రమే తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు ఇసుకను సరఫరా చేయాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు సైతం ఇసుక కొరత లేకుండా తమ నిర్మాణాలకు కావాల్సిన ఇసుకను తోలుకోవాలని ఎంఎల్ఏ సూచించారు. ఇందుకు జేసీ సానుకూలంగా స్పందించారు.

పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలి: రూపాదేవి


చెత్తకుండీని పరిశీలిస్తున్న రూపాదేవి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణ క్రమంగా చేపడుతూ పరిశుభ్రంగా ఉంచాలని డివిజనల్ పంచాయతీ అధికారి రూపాదేవి సూచించారు. గురువారం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలో రూపాదేవి వీధుల్లో పర్యటించారు. చెత్త నిర్వహణ, ఎప్పటికప్పుడు ఇంటింటి చెత్త సేకరణ, చెత్త కుండీలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్‌ను ఆదేశించారు. బుధవారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరైన నేపథ్యంలో రూపాదేవి ప్రస్తుత పరిస్థితులను గమనించడానికి పర్యటించానన్నారు. పంచాయతీలు విభజన జరిగిన తరువాత సప్తగిరి కాలనీ, మంగళం గ్రామపంచాయతీల మధ్య చెత్త సేకరణలో ఉన్న వివాదంకు పరిష్కారం చూపారు. నెలలో రెండు పంచాయతీలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు చెత్తను చెత్త కుండీల వద్ద నుంచి శుభ్రం చేసే విధంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అలానే ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీకి కేటాయించబడ్డ చెత్త నుంచి సంపద కేంద్రం నిర్వహణకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు గతంలో పంపామన్నారు. మళ్లీ పెరుగుతున్న జనాభా దృష్ట్యా, చెత్త నిర్వహణకు నూతన ప్రణాళికలను సిద్ధం చేసి కలెక్టర్‌కు ప్రతిపాదిస్తామన్నారు.

వైసిపి నేతలకు శిక్ష తప్పదు : ఎంఎల్ఎ ఆరణి



ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఎన్‌డిఎ కూటమి నేతలను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులకు శిక్ష తప్పదని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు హెచ్చరించారు. డివిజన్ స్థాయిలో ఇబ్బంది పెట్టినవారిని గుర్తించాలన్నారు. గురువారం 23, 24, 25, 29 డివిజన్ల కృతజ్ఞతా సమావేశం వేశాలమ్మ ఆలయ సమీపంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి బుల్లెట్ రమణ ఆధ్వర్యంలో జరిగింది. 30, 31, 36, 37 డివిజన్ల సమావేశం దంపూరి భాస్కర్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. 30వ డివిజన్‌లో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని, రజకుల కమ్యూనిటీ హాలు నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న వీరభద్ర స్వామి ఆలయాన్ని పూర్తి చేయాలని ఎంఎల్ఎకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, నరసింహయాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి, విజయ్‌కుమార్, చినబాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆరణిని సత్కరించిన ఆర్కాట్

తిరుపతి గాంధీభవన్ నందు వార్డులలో తన విజయానికి కష్టపడిన కూటమి నాయకులకు, కార్యకర్తలకు కతజ్ఞత సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు, మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మ విచ్చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తన విజయం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తుపెటుకుంటానని తెలిపారు. తిరుపతి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆర్కాట్ కష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, చెఋకుల నీలాద్రి రాయల్ , టీడీపీ నాయకులు ఆముదాల తులసీరామ్, తోట జయంతి, గోపి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులను కలిసిన రాచేటి సుబ్రమణ్యం



ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: టీడీపీ తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షులు రాచేటి సుబ్రమణ్యం గురువారం అమరావతిలో పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, బాల వీరాంజనేయస్వామి ఎమ్మెల్యే మాధవిలను కలిసి శుభాభినందనలు తెలిపారు.

ప్రాంక్ వీడియోలు హేయమైన చర్య : టిటిడి

ప్రజాశక్తి-తిరుమల: భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రాంక్ వీడియోలు తీయడం హేయమైన చర్యని టిటిడి పేర్కొంది. తిరుమల శ్రీవారి సర్వదర్శనం క్యూలైన్‌లో దర్శనానికి వెళుతూ కొందరు తమిళ యూట్యూబర్లు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తీసిన ప్రాంక్ వీడియో హేయమైన చర్యని పేర్కొన్నారు. అటువంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నారాయణగిరి షెడ్లల్లో క్యూలో వెళుతూ మరో కంపార్టుమెంట్ తాళాలు తీసే ఉద్యోగిలా కొందరు యూట్యూబర్లు ఒక ప్రాంక్ వీడియోని రూపొందించారు. కంపార్టుమెంట్‌లో నిరీక్షిస్తున్న భక్తులు ఆ తాళాలు తీసే వ్యక్తిని టిటిడి ఉద్యోగిగా భావించి ఒక్కసారిగా పైకి లేవడంతో సంబంధిత వ్యక్తి వెకిలిగా నవ్వుతూ ఉండే ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో ముఖ్యంగా తమిళనాట వైరల్ అయ్యింది. సాధారణంగా నారాయణగిరి షెడ్స్ దాటి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ప్రవేశించక ముందే భక్తులనుండి మొబైల్స్ డిపాజిట్ చేయడం జరుగుతుంది. నిత్యం భక్తుల గోవింద నామాలతో మారుమోగే తిరుమల కంపార్ట్మెంట్లలో, వారి మధ్యనే ఉండి ఒకరిద్దరు ఆకతాయిలు చేసిన ఈ వికత చేష్టలతో భక్తుల మనోభావాలు దెబ్బ తిన్నాయి. ఇటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని టీటీడీ హెచ్చరించింది.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని సీఆర్‌పీ ప్రసాద్, ప్రగతి ట్రస్ట్ ఇన్‌ఛార్జ్ రామచంద్రయ్య అన్నారు. మండలంలోని బి.వి పురం పంచాయతీలో గురువారం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సిఆర్పి ప్రసాద్, ప్రగతి ట్రస్ట్ ఇన్‌ఛార్జ్ రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కిట్స్, మధ్యాహ్నం భోజన పథకం, అలాగే తల్లికి వందనం పథకం ద్వారా ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో రూ.15వేలు అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతోపాటు నోట్ బుక్స్, యూనిఫార్మ్, ప్రభుత్వమే అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో తొండమనాడు జెడ్పీ ఉన్నత పాఠశాల సీఆర్‌పీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంట్రల్ పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతిటౌన్

తిరుపతి నగరంలో ఏర్పాటు చేయనున్న ట్రాఫిక్ సిగ్నల్స్, సిసి కెమెరాల కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ పనులను పూర్తి చేయాలని, నగరంలో ఎక్కడెక్కడ అధునాతన ట్రాఫిక్ సిగ్నల్స్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలో ఒక సమగ్ర నివేదికను తయారు చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి అదితిసింగ్ ఐఏఎస్ అన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ఐట్రీపుల్ సి లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు చేయాల్సిన పనుల గురించి తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల నిర్వాహణ భాగస్వామ్యులతో స్మార్ట్ సిటీ ఎండి అదితిసింగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి పోలీస్ ఏఎస్పి కులశేఖర్, ట్రాఫిక్ డిఎస్పి రమణ కుమార్, టెలికామ్ జి.ఎం వెంకోబరావు, ఎపిఎస్పిడిసిల్ ఎస్.ఇ సురేంద్ర నాయుడు, మునిసిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటి జిఎం చంద్రమౌళి, ఏయికామ్ ప్రతినిధి భాలాజీ, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

పేదలు సైతం సన్న బియ్యం తినాలి


శ్రీకాళహస్తిలో

- ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేదలు సైతం నాణ్యమైన సన్న బియ్యం భోజనాన్ని పోషక విలువలతో కూడిన కూరలతో కలిపి తినాలని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్స్ అసోసియేషన్స్, హెూల్ సేల్ మర్చంట్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా తక్కువ ధరలకే నిత్యవసర వస్తువులను అందించేందుకు ప్రత్యేక విక్రయ కేంద్రాలను ప్రారంభించడం హర్షిణీయమని కొనియాడారు. గురువారం ఎమ్మెల్యే పట్టణంలో అయ్యప్ప జనరల్ స్టోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆకాశాన్ని అంటిన నిత్యవసర వస్తువులను పేదలకు తక్కువ ధరకే అందించి ప్రజలందరూ సంతోషంగా ఉండేలా చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు మొన్న ఉచిత ఇసుక, నేడు తక్కువ ధరలకు నిత్యవసర వస్తువులును అందించేందుకు ముందుకు రావడం శుభ పరిణామామని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేజీ బియ్యం రూ.48కు, కందిపప్పు కేజీ రూ.160 అందించేలా విక్రయాలు ప్రారంభింపజేశారు. ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘువీర్, టీడీపీ నేతలు విజయ్ కుమార్, మునిరాజా నాయుడు, చెంచయ్య నాయుడు, దశరథచారి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కొనేటి ఆదిమూలం అన్నారు. గురువారం సత్యవేడు నేతాజీ రోడ్డులోని బిబిఎస్ లాడ్జి ప్రాంగణంకు చేరుకొని ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను ప్రభుత్వం నిర్దేశించిన ధర కేజీ పచ్చి బియ్యం రూ.48, స్టీమ్డ్ బియ్యం రూ.49, కందిపప్పు రూ.160కు పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయులు, వికేఎన్ ఫార్మసీగ, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మస్తాన్, సుందర్ రామిరెడ్డి, బిబిఎస్ రెడ్డి, ప్రదీప్ కుమార్, శోభ, చిన్న, డేవిడ్, సుబ్బారావు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: ప్రజలకు అందుబాటు ధరలతో నిత్యావసరాలు విక్రయాలు చేపడుతున్నట్లు గూడూరు తహశీల్దార్ కరుణ్‌కుమార్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని రైతు బజార్లో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్, హోల్‌సేల్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయాలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దార్ హజ్మతుల్లా ఖాన్, నాయకులు చెంచు రామయ్య, శివకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


సత్యవేడులో

క్రైం కార్నర్

ఎర్రచందనం స్వాధీనం

- 8 మంది స్మగ్లర్ల అరెస్టు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీప్రాంతంలో 8మంది ఎర్రచందనం స్మగ్లర్లును అరెస్ట్ చేసి వారి నుంచి 11ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐలు సురేష్ బాబు, వినోద్‌కుమార్ రెడ్డి బృందాలు బుధవారం సానిపాయ రేంజ్ గుండ్రేటివారిపల్లి చేరుకుని అక్కడ నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాలను తనిఖీ చేసుకుంటూ వెళుతుండగా రాయవరం సెక్షన్ నల్లగుట్ట ప్రాంతం చేరుకోగా, అక్కడ కొంతమంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారన్నారు. వారిని హెచ్చరించి చుట్టుముట్టగా కొందరు దుంగలు పడేసి పారిపోయారు. వారిని వెంబడించి 8మంది స్మగ్లర్లును అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డవారు తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా అంబూరు తాలూకాకు చెందిన చక్రవర్తి గోవిందన్ (40), హరికృష్ణన్ శ్రీనివాసన్ (49), గోవిందరాజు మురుగన్ (23), వి శక్తివేల్ (27), తిరుపతి సెల్వం (24), సెల్వం చిన్న కుజహండ (50), సురేష్ (23), అనంతపురం జిల్లా కన్నపల్లికి చెందిన వడ్డే సుబ్రహ్మణ్యం(45)లుగా గుర్తించమన్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు స్టార్టర్ల చోరీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని పొయ్య గ్రామ వ్యవసాయ క్షేత్రంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటార్, స్టార్టర్ల చోరీకి పాల్పడ్డారు. రైతులకు చెందిన సుమారు 45 స్టార్టర్‌లను పగలగొట్టి అందులో ఉన్న రాగి తీగలను అపహరించుకొని పోయారు. గురువారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు స్టార్టర్లు ధ్వంసమై ఉండడాన్ని చూసి తొట్టంబేడు పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు ఎస్ఐ రాఘవేంద్ర రావు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పురపాలక పరిధిలోని గాంధీనగర్ ప్రాంతం వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెలుగుచూసింది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు కోట గ్రామానికి చెందిన నవకోటి సందీప్(31) మనస్థాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి హుటాహుటిన చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. 108 వాహనం ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణ సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గూడూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. తడ నుంచి కావలికి మినీ లారీతో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారాన్నరు. 15.5టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసిన, విక్రయించిన చట్ట పరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ తనిఖీల్లో రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.